**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :10 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 5 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## లండన్ ఐ' తరహా రాజధానిలో


# 'అమరావతి ఐ'

### రూ. 547 కోట్లలో అమరావతిలో ప్రభుత్వ భవనాలు

### ఉపాధి పనులు 100 నుంచి 125 రోజులకు పెంపు

### ఏపీ కేబినెట్‌లో ఆమోదం

### వివరాలు వెల్లడించిన సమాచార శాఖ మంత్రి పార్థసారథి



**అమరావతి**

లండన్‌లోని ప్రసిద్ధ 'లండన్ ఐ' రాజధాని తరహాలో అమరావతిలో కృష్ణా నది తీరాన 'అమరావతి ఐ' పేరిట భారీ స్థాయిలో జియాంట్ అబ్జర్వేషన్ వీల్‌ను నిర్మించేందుకు సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. 'అమరావతి ఐ" అనేది ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించబోతున్న ఒక పెద్ద ప్రాజెక్టు. అక్కడ నిర్మించనున్న భారీ చక్రం పైకి వెళ్లినప్పుడు పర్యాటకులు అందులో కూర్చుని అమరావతి నగరాన్ని, నది అందాలను చుట్టూ ఉన్న పరిసరాలను చాలా ఎత్తు నుండి స్పష్టంగా చూడవచ్చు. ఇది మన రాజధానిలో పర్యాటకాన్ని పెంచడానికి, పర్యాటకులను ఆకర్షించడానికి ఒక ప్రత్యేకమైన ల్యాండ్‌మార్క్‌గా నిలవనుంది. రూ. 547 కోట్లతో రాజధాని అమరావతి నగరంలో అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలో సూపర్ బ్లాక్ 'ఊ'లో హైకోర్టు భవనంలో రూఫ్ టాప్ ఎలివేషన్లలో ప్రీకాస్ట్ ఫిన్స్, పార్కింగ్, సెక్యూరిటీ పెవిలియన్లు, వాటర్ బాడీలు, అంతర్గత రోడ్లు, సబ్‌స్టేషన్, జడ్జెస్ డ్రాప్--ఆఫ్ -- ఇతర పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాజధాని అమరావతి నగరంలో రాయపూడి గ్రామంలో నిర్మిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ, సెక్రెటరీ స్థాయి అధికారుల భవనాలకు వివరాలు 2లో..



## ప్రతిపక్షాల సమావేశానికి డీఎంకే దూరం

- 'ఇండి కూటమి'ని వీడుతోందా
- తమిళనాడులో కాంగ్రెస్, టీవీకే పొత్తుతో రగులుతున్న విభేదాలు
- తమ పార్టీ కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి సమావేశానికి హాజరు కాబోమని ప్రకటించిన డీఎంకే
- లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి అనుమతించిన సచివాలయం



## దిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు

- ఎమర్జెన్సీ ఎగ్జిట్, వెంటిలేషన్ లేదట!
- మాలవీయా నగర్ అగ్నిప్రమాదంలో వెలుగుచూసిన కీలక విషయాలు
- ప్రమాద సమయంలో మూసి ఉన్న భవనం పైకప్పు



## మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

- నీట్ విద్యార్థిని బలవన్మరణంపై రాహుల్ స్పందన
- పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయి
- నీట్ విద్యార్థిని మరణం కేవలం బలవన్మరణం కాదు
- అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోరం
- నీట్ విద్యార్థినీ మరణంపై తీవ్రంగా స్పందించిన రాహుల్‌గాంధీ



### సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై

## ప్రత్యేక దృష్టి

**జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య వెల్లడి**

**అమరావతి**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు, రాజ్యాంగ పరమైన రక్షణలు, ఉద్యోగుల సమస్యలపై ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించామని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య, సభ్యుల బృందం తెలిపారు. గిరిజనుల హక్కులను పరిరక్షించడం, వివరాలు 2లో..

## మరోసారి డీలిమిటేషన్ బిల్లు.. డీఎంకే, టీఎంసీ మద్దతు?



- వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.
- దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు
- డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది.
- జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం


## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల



- ఇటీవలే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది
- జూన్ 18న పెద్దల సభకు ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.
- దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

# సైకిల్‌పై ప్రయాణిస్తా

- పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక సంకల్పం చేద్దాం: చంద్రబాబు
- పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత
- రేపు సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం
- ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటుదాం
- పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తా - 'ఎక్స్'లో సీఎం పోస్ట్



**అమరావతి**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. భూమి మన ఇల్లు-ప్రకృతి మన జీవనాధారమని అన్నారు. పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దామని కోరారు. ఈ మేరకు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పచ్చదనం పెంపు, వివరాలు 2లో..



## భారత్‌లో ముగ్గురు ఎబోలా వైరస్

- అనుమానితుల గుర్తింపు
- ఆరోగ్య శాఖ అప్రమత్తం
- కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తం
- ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే
- కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపి
- ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పౌరులకు కీలక అడ్వైజరీ జారీ

## వెయ్యి రోజులు 'నవచేతన'

- చిన్నారుల జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే లక్ష్యం
- స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




**అమరావతి**

ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నవచేతన కార్యక్రమం ద్వారా వెయ్యి రోజుల పాటు పోషకాహారం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివద్ధి వివరాలు 2లో..

# భారత్‌లో ముగ్గురు ఎబోలా వైరస్

ప్రపంచవ్యాప్తంగా ఎబోలా ఆందోళనల నేపథ్యంలో భారత్‌లోనూ వైరస్ కలకలం రేపింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఎబోలా వైరస్ అనుమానితులను గుర్తించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కాంగో, ఇథియోపియా, ఉగాండా దేశాల నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ అభిజిత్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ముగ్గురు వ్యక్తుల ఆచూకీని గుర్తింపు, వారి పర్యవేక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే, ఇప్పటివరకు వారిలో ఎవరికీ ఎబోలా సోకినట్లు నిర్ధారణ కాలేదని తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొంది.



**భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ**

ఇదిలా ఉండగా కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పౌరులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని క్లారిటీ ఇచ్చింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని చెప్పింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వివరించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని వివరించింది.

**ఎయిర్?పోర్టుల్లో కఠిన తనిఖీలు**

అంతేకాకుండా, భద్రత, ముందు జాగ్రత్త చర్యగా ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కఠినమైన తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కఠిన తనిఖీలు చేపట్టారు. అలాగే సముద్ర ఓడరేవుల వద్ద కఠినమైన నిఘాను కొనసాగిస్తున్నారు. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలను అధిక ప్రమాదం ఉన్న దేశాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలను తప్పనిసరి చేశారు. అంతేకాకుండా, ఎబోలా అనుమానిత కేసులను ఎదుర్కోవడానికి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, ఆసుపత్రులను సిద్ధం చేశాయి.

మరోవైపు కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించినట్లు వెల్లడించింది. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు చెప్పారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా, ఒకరు మరణించారు. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. అటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) దీనిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది.

ఇదిలా ఉండగా, హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. సూడాన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించగా అతడికి ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది, అతన్ని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి జజవీదీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# ప్రతిపక్షాల సమావేశానికి డీఎంకే దూరం

దిల్లీ వేదికగా జూన్ 8న జరగనున్న 'ఇండి' కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనుంది. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు ఇండి కూటమి నేతలు జూన్ 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. అయితే, తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో డీఎంకేకు సంబంధాలు క్షీణించాయి. ఫలితంగా ఈ భేటీకి డీఎంకే నేతలు దూరంగా ఉండనున్నారు. ఈ సమావేశంలో సుమారు 17 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ భేటీలో చట్టసభల లోపల, బయట అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం డీఎంకేకు ఆగ్రహం తెప్పించింది. ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇండి కూటమి భేటీకి, డీఎంకే గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది.



మరోవైపు కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఆమెతో పాటు ఇటీవల దాడికి గురైన టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. వీరితో పాటు పలు రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు సమావేశానికి హాజరుకానున్నారు.

**'మా కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి'**

అయితే, తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమకు చేసిన ద్రోహానికి తమ పార్టీ కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని డీఎంకే తెలిపింది. "డీఎంకే పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని, వాటికి గౌరవం ఇస్తున్నాం. ముఖ్యంగా కాంగ్రెస్ పాల్గొంటున్న సమావేశం కావడంతో జూన్ 8న దిల్లీలో జరగనున్న ఇండి కూటమి సమావేశంలో డీఎంకే పాల్గొనదు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాకపోయినప్పటికీ, సమావేశంలో పాల్గొనే ఇతర పార్టీలు దేశ శ్రేయస్సుకు సంబంధించిన ఏవైనా అంశాలను ప్రస్తావిస్తే, వాటిపై ఎప్పటిలాగే తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుంది" అని డీఎంకే పేర్కొంది.

**ఇకపై మేం ఇండి కూటమిలో భాగస్వాములం కాదు!**

మరోవైపు, తాము ఇకపై ఇండి కూటమిలో భాగస్వాములం కాదని, అందుకే ఈ సమావేశానికి హాజరుకావడం లేదుని డీఎంకే నాయకుడు టీకేఎస్? ఇళంగోవన్ పేర్కొన్నారు. డీఎంకేతో తమ బంధాన్ని తెంచుకుంటున్నామని కాంగ్రెస్ స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమ కార్యకర్తలు తీవ్రంగా శ్రమించారని తెలిపారు.

"తాము టీవీకేతో కలిసి ముందుకు సాగుతున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా టీవీకేతోనే కలిసి పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీని అర్థం వారు ఇకపై మాతో లేరని. అలాంటప్పుడు మేము ఇండి కూటమిలో ఎలా కొనసాగగలం? అందుకే మేము ఈ సమావేశానికి వెళ్లడం లేదు. కూటమిలో భాగంగా పోటీ చేసి గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు వారి వెంట ఉన్నారు. మేం వారికి ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా కేటాయించాం. ఇన్ని చేసిన తర్వాత కూడా, ఆ ఎమ్మెల్యేలు కనీసం వచ్చి మా నాయకుడికి కృతజ్ఞతలు కూడా తెలుపలేదు. తాము టీవీకేతో వెళ్తున్నామని, ఇకపై డీఎంకేతో తమకు పొత్తు లేదని వారు ప్రకటించారు. సహజంగానే, ఇది మా కార్యకర్తల మనసులను తీవ్రంగా గాయపరిచింది. వారి గెలుపు కోసం మా కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారు. 28 నియోజకవర్గాల్లో వారు కాంగ్రెస్ అభ్యర్థుల కోసం శ్రమించారు. అందుకే మేం సమావేశంలో పాల్గొనం. అసలు ఇండి కూటమిలోని ఎన్ని పార్టీలు ఈ సమావేశంలో పాల్గొంటాయో వేచి చూద్దాం" అని ఇళంగోవన్ పేర్కొన్నారు.

**లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవనున్న డీఎంకే!**

ఇదిలా ఉండగా, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి డీఎంకేకు అనుమతి లభించింది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం నుంచి అనుమతి లభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామి కావటంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో కాంగ్రెస్ తమ మిత్రపక్షం కానందున లోక్‌సభలో తమ ఎంపీల సీటింగ్‌ను మార్చాలని గతనెలలోనే లోక్‌సభ సెక్రటేరియట్‌ను డీఎంకే కోరింది.

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువ తరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపుర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది. ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షల అప్పు తీసుకున్నారు. నాగపుర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడింది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈనాటికీ తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదు." ఇదిలా ఉండగా, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ) నిర్వహించాల్సిన నీట్ (యూజీ) 2026 పరీక్షను మే 12న రద్దు చేశారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఆరోపణలపై స్పందించిన ప్రతిపక్షాలు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్? చేశాయి. అయితే, నీట్? పరీక్షను తిరిగి జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ అధికారులు ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఐదుగురి నిందితులకు జూన్ 2 వరకు ఉన్న కస్టడీని 15 వరకు పొడిగిస్తూ మంగళవారం దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంగీలాల్ ఖటిక్, వికాస్ బివాల్, దినేశ్ బివాల్, యశ్ యాదవ్, ధనుంజయ్ లోఖండేల జ్యుడిషియల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ సీబీఐ అభ్యర్థనను ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ అజయ్ గుప్తా అంగీకరిస్తూ తీర్పును వెలువరించారు. మరోవైపు, నీట్ యూజీ పునఃపరీక్షకు చదువుకోవడానికి పుస్తకాలు కావాలని కోరుతూ, పేపర్ లీక్ నిందితుడు యశ్ యాదవ్ దాఖలు చేసి న దరఖాస్తును మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. ఈ మేరకు నిందితుడి తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

**ప్రధాన సూత్రధారి నివాసం కూల్చివేత**

ఇక, నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించి సర్వే నిర్వహించగా, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆయనకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో ఆ ఆక్రమణలను తొలగించారు.

## మరోసారి డీలిమిటేషన్ బిల్లు.. డీఎంకే, టీఎంసీ మద్దతు?




**ఢిల్లీ:** పార్లమెంట్ ముందుకు మరోసారి డీలిమిటేషన్ బిల్లు వచ్చే అవకాశం ఉంది. దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ సమీకరణాలు మారాయి. డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, తమ ప్రాతినిధ్యం తగ్గకుండా ఉంటే వ్యతిరేకించాల్సిన అవసరం లేదని డీఎంకె వర్గాలు అంటున్నాయి. డీఎంకే నేతలతో అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వాజ్‌పేయి మంత్రివర్గంలో డీఎంకే భాగస్వామిగా ఉంది. తమిళనాడులో డీఎంకేకు కాంగ్రెస్ పార్టీ గుడ్‌బై చెప్పడంతో పరిణామాలు మారాయి. డీ లిమిటేషన్ బిల్లుకు పలువురు టీఎంసీ ఎంపీలు కూడా సహకరించే అవకాశం ఉంది. డీఎంకే, టీఎంసీ పార్టీలకు లోక్ సభలో 50 మంది ఎంపీలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 50 శాతం లోక్ సభ, 50 శాతం అసెంబ్లీ సీట్లు పెంచేలా డీ లిమిటేషన్ బిల్లును రూపొందించారు. గత ప్రత్యేక సమావేశాల్లో 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. వర్షాకాల సమావేశాల తొలి వారంలో జేపీసీ నివేదికను వన్ నేషన్ వన్ ఎలక్షన్ కమిటీ ప్రవేశపెట్టనుంది. రెండు దశల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదనలు ఉన్నాయి

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

ఢిల్లీ: బీజేపీ రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీష్ అగర్వాల్, గుజరాత్ నుంచి రాజుభాయ్ శుక్లా, ముకేశ్ భాయ్ రత్వ, మాన్సింగ్, జితేంద్ర మేక్జి భాయ్, మణిపూర్ నుంచి శారదా దేవి, రాజస్థాన్ నుంచి ఆల్క గుర్జర్, సతీష్ పునియా ,ఒడిశా నుంచి దేభాషిస్ సమంతరే, లు పోటీ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది. కాగా ఇటీవలే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న పెద్దల సభకు ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అదే రోజున ఫలితాలుంటాయి. దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.నామినేషన్ దాఖలుకు జూన్ 8 చివరితేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 11 వరకూ విత్‌డ్రాకు సమయముంటుంది. జూన్ 20తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది

## దిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు



దిల్లీ మాలవీయ నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. మంటలు చెలరేగినప్పుడు భవనం పైకప్పు మార్గం మూసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంగానే లోపల ఉన్నవారు ప్రాణాలతో తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఇంకా అనేక లోపాలను కూడా అధికారులు గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఘటన జరిగిన తర్వాత పోలీసులు గెస్ట్ హౌస్‌లోని గదుల్లో సోదాలు నిర్వహించి దాదాపు 50 నుంచి 60 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో సుమారు 30 పాస్‌పోర్ట్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**దట్టమైన పొగ, ఊపిరాడకపోవడం వల్లే అత్యధిక మరణాలు**

ఇదిలా ఉండగా, దర్యాప్తు సమయంలో భవనం భద్రతా, మౌలిక సదుపాయాల్లో అనేక తీవ్రమైన లోపాలను కూడా అధికారులు గుర్తించారు. భవనం కిటికీలు, గ్లాసులు పూర్తిగా మూసివేసి ఉన్నాయని, ఫలితంగా పొగ బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ అగ్నిప్రమాదంలో భవనంలోని మూడో అంతస్తు, బేస్‌మెంట్‌లో ఉన్నవారు ఎక్కువగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. దట్టమైన పొగ వల్ల ఊపిరి ఆడకనే అత్యధిక మరణాలు సంభవించినట్లు పేర్కొన్నారు. ఆ భవనంలో సరైన వెంటిలేషన్ ఏర్పాట్లు లేవని, ఎమర్జెన్సీ ఎగ్జిట్? గేటు కూడా లేదని దర్యాప్తులో వెల్లడైంది. ఈ లోపాల కారణంగా పొగ భవనం అంతటా వేగంగా వ్యాపించిందని, తరలింపు ప్రయత్నాలకు తీవ్ర ఆటంకం కలిగించిందని పేర్కొంది. మంటలను అదుపులోకి తెచ్చిన తర్వాత కూడా గెస్ట్ హౌస్‌లోని గదులు అత్యంత వేడిగా ఉన్నాయని, ఇది మంటల తీవ్రతను సూచిస్తోందని తెలిపాయి. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా భావిస్తున్న కేసర్ సింగ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

**చట్టవిరుద్ధంగా హోటల్‌లో అదనపు అంతస్తులు నిర్మించిన యజమాని**

మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన దిల్లీ పోలీసులు మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న హోటల్ మేనేజర్ జై మిశ్రాను పట్టుకునేందుకు 5 బృందాలు గాలిస్తుండగా మిగిలిన 5 బృందాలు ఇతర కోణాల్లో విచారణ జరుపుతున్నాయి. బుధవారం హోటల్ యజమాని లవ్‌కేశ్ శర్మ అరెస్టుకు ముందు దేశం విడిచి పారిపోకుండా ఆయనతో పాటు ఆయన భార్యపై ముందస్తు చర్యగా పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. మొదట 2 అంతస్తులతో మాత్రమే హోటల్ ప్రారంభించిన యజమాని, ఆ తర్వాత చట్టవిరుద్ధంగా అదనంగా మరో రెండున్నర అంతస్తులను నిర్మించినట్లు విచారణలో తేలింది. మరోవైపు ఇప్పటివరకు ఐదుగురు మృతులను గుర్తించారు దర్యాప్తు అధికారులు. మిగిలిన బాధితుల గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. వారిని గుర్తించేందుకు పోస్ట్‌మార్టం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మృతుల శరీరాలపై తీవ్రమైన కాలిన గాయాలు లేవని చెప్పాయి. ఘటనా స్థలంలో లభ్యమైన పాస్‌పోర్టుల ఆధారంగా విదేశీయుల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. ఆ గెస్ట్ హౌస్‌లో బస చేస్తున్న విదేశీయుల్లో అధిక శాతం మంది వైద్య వీసాలపై భారతదేశానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ గెస్ట్ హౌస్‌లో ప్రతి నెలా సుమారు 80 మంది విదేశీయులు బస చేసేవారని తెలిపాయి. నిబంధనల ప్రకారం, విదేశీ అతిథుల కోసం సి-ఫారమ్‌లను క్రమం తప్పకుండా నింపి ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఖీ==ూ)కు సమర్పించేవారు. సమర్పించిన తర్వాత, విదేశీయుల వివరాలు దిల్లీ పోలీసు వ్యవస్థలో కూడా నమోదు చేస్తారు. దిల్లీలోని మాలవీయ నగర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 21 మంది మరణించారు. వారిలో 11 మంది విదేశీయులు ఉన్నారు. రక్షించిన 58 మందిలో 35 మంది చికిత్స పొందుతున్నారు. 19 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

# కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు





మండల కేంద్రంలో వైసీపీ శ్రేణులు నిరసన

**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 04:** ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కూటమి ప్రభుత్వంలో ఏ పి ప్రజలకు పొడిసిన వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తయ్యాయని పాయకరావుపేట నియోజకవర్గ వైయస్సార్సీపి కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ అన్నారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో నక్కపల్లి వైఎస్ఆర్సిపి కార్యాలయం వద్ద కూటమి అసమర్ధ పాలనకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చేపట్టారు. కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు, వీసం రామకృష్ణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చాక ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక హామీ కూడా నెరవేర్చకుండా సూపర్ సిక్స్ అమలు చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఒక్క కొత్త పెన్షన్ గాని పేదలకు ఇల్లు గానీ మంజూరు చేయలేదు అన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి సంతకాలతో విడుదల చేసిన కూటమి మేనిఫెస్టో కరపత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ నెల 12న చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసాల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందరావు, నాయకులు సీరం నరసింహమూర్తి, మణిరాజు, పొడకట్ల పాపారావు, వీసం రాజు, కొప్పిశెట్టి హరి, సురకాసుల గోవిందు, పోతంశెట్టి బాబ్జి, నల్లల రామకృష్ణ, ఎల్లేటి సత్యనారాయణ, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎంపీ పై అబాండాలు వేస్తే ఖబర్దార్ బీజేపీ నేతలు



పంచదార్ల కొండ గ్రావెల్ తవ్వకాల పై చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి చిన్నారావు

**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 04**: ఎంపీ సీఎం రమేష్ పై అబాండాలు వేస్తే ఖబర్దార్ అంటూ యలమంచిలి నియోజకవర్గ బీజేపీ నాయకులు హెచ్చరించారు. అచ్యుతాపురంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, ఎలమంచిలి నియోజకవర్గ బీఎల్ఏ-1 ఇంచార్జ్ కొరుపోలు చిన్నారావు మాట్లాడారు. పంచదారల కొండ పై గ్రావెల్ తవ్వకాల పై చరిత్ర తెలుసుకొని వైఎస్ఆర్సీపీ నాయకులు మాట్లాడాలని సూచించారు. కూటమి నాయకుల పై ఆధారాలు లేకుండా కొన్ని పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఆధారాలు లేని వార్తలు రాస్తే పరువు నష్టం దావా వేస్తామని, కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వి పంచదారల కొండను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దీని పై మాట్లాడే ముందు కరణం ధర్మశ్రీ నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ అచ్యుతాపురం మండల అధ్యక్షులు కూంద్రపు నాయుడు బాబు, జిల్లా బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి లాలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణా సమావేశం





- మండలవిద్యాశాఖాధికారిరుత్తల నాగన్నదొరరి
- ముఖ్య అతిథిగా హాజరయిన యలమంచిలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు

**నక్కపల్లి పెన్ సత్తా, జూన్ 04**: :త్వరలో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా ఒకవైపు నాణ్యతతో కూడిన విద్యను అందించడమేకాకుండా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించింది.దీనిలో భాగంగా గురువారం మండలంలో ఉన్న అన్నిప్రాథమిక ,ఉన్నతపాఠశాలల లో మద్యాహ్నభోజనం నిర్వహిస్తున్న నిర్వాహకులతో మండలవిద్యాశాఖాధికారి2 ఆర్.నాగన్నదొర, నరేష్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక సూచనలను అందించారు.ఈ సందర్భంగా శిక్షణాతరగతులకు ముఖ్య అతిధిగా హాజరయిన డివైఈవో పెన్నాడ అప్పారావు మాట్లాడుతూ పోషకాహార నిర్వాహణ-విద్యార్థుల పెరుగుదల,మెదడు అభివృద్ధి,రోగనిరోధకశక్తి,శారీరక కార్యకలాపాలు నిర్వాహణకు తగినంత శక్తి ఉండాలంటే వంట చేసే సిబ్బంది ఇచ్చిన మెనూ ప్రకారం అంకితభావంతో వండి వడ్డించాలని,అప్పుడే మన ఆశయం నెరవేరుతుందన్నారు.ఆరోగ్యాంధ్రప్రదేశ్ కల నెరవేరాలంటే విద్యార్థిదశనుండే పోషకాహార నియమాలు పాటించాలన్నారు.ముఖ్యంగా 6-18 వయస్సుపిల్లలలో ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే మనం అందించే పోషక ఆహారంపైనే ఆధారపడి ఉందనేది మరచిపోకూడదన్నారు.శరీర సౌష్టవానికి మేలు కలిగించే పప్పుధాన్యాలు,నూనె గింజలు,రక్షిత ఆహారాలైన ఆకుకూరలు అందించాలన్నారు.ఇచ్చిన మెనూ ప్రకారమే వండాలన్నారు. బియ్యం,ఆహారధాన్యాలు ప్రాథమిక తరగతులకు 100 గ్రాములు,హైస్కూల్ విద్యార్థులకు 150 గ్రాములు, పప్పులు ప్రాథమిక 20 ఉన్నత పాఠశాలకు 30 గ్రాములు.కూరగాయలు ప్రాథమిక 50 ఉన్నత పాఠశాలలకు 75, ప్రకారం ఖచ్చితంగా ఉండాలన్నారు.. ఈ సందర్భంగా మద్యాహ్న భోజన పథకం నిర్వాహకులు అక్కడకక్కడే తయారుచేసినవివిధ వంటకాల పలువురకు నోరు ఊరించాయి

అనంతరం మండలవిద్యాశాఖాధికారి 1 కే.నరేష్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరయిన తల్లిదండ్రులకు కూడా పలు సూచనలు చేశారు. పాఠశాలలో నిర్ణీత సమయానికే రుచికరమైన భోజనం అందిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు చిన్నవయస్సులోనే ఆరోగ్యకరమైన అలవాట్లను ఇంటివద్ద తల్లిదండ్రులు నేర్పించాలన్నారు .జంక్ ఫుడ్స్ జోలికి వెళ్ళవద్దన్నారు.

# ఉపాధ్యాయులు డిజిటల్ బోధనపై అవగాహన కలిగియుండాలి




డివైఈవో పెన్నాడ అప్పారావు

**నక్కపల్లి పెన్ సత్తా, జూన్ 04**: :ప్రతీ ఉపాధ్యాయుడు డిజిటల్ బోధన పై అవగాహన కల్పించుకుని విద్యార్థులకు ఆసక్తికరమైన బోధన చెయ్యాలని యలమంచిలి జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. గురువారం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో కోర్స్ కన్వీనర్ వి.బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞాన ప్రకాష్ శిక్షణా తరగతులను ఆయన డివైఈవో పి అప్పారావు పరిశీలించారు.అనంతరం శిక్షణకు హాజరయిన ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలతో కూడిన విద్య అందించాలన్నారు.ప్రాథమిక అక్షరాస్యతను పెంచడానికి ఈ శిక్షణా తరగతు లు దోహదపడతాయన్నారు.పిల్లల అభ్యసన సామర్థ్యాలు తెలియజేయడం-డిజిటల్ ప్లాట్ ఫాం అనే అంశంపై ఈ తరగతులు లో చర్చించాలన్నారు .ఈ కార్యక్రమంలో ఎంఈవో 1 కే నరేష్, ఎంఈవో 2 ఆర్.నాగన్నదొర తదితరులు పాల్గొనారు.రిసోర్స్ పర్సన్ గా నర్సిపల్లి మోహనరావు వ్యవహరించారు

## నీతి ఆయోగ్ లో పాడేరు"ఐటిడిఏ" ఏపిలోనే బెస్ట్!..

డిల్లీలో అవార్డు అందుకున్న పిఓ ఆదిత్య వర్మ.




**పాడేరు పెన్ సత్తా, జూన్ 04:**గిరిజన ప్రాంతాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో పాడేరు ఐటీడీఏ ఏపి రాష్ట్రంలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. అన్ని ఐటీడీఏల పరిధిలో అత్యు త్తమ ప్రతిభ కనబరిచి నందుకు పాడేరు ఐటీడీఏకు 'బెస్ట్ ఐటీడీఏ' (ఉత్తమ ఐటీడీఏ)గా జాతీయ స్థాయి అవార్డు దక్కింది.న్యూఢిల్లీలో జరిగిన ఒక ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డాక్టర్ అశోక్ కుమార్ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (సెక్రటరీ) చేతుల మీదుగా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, ఏపిఓ(పివిటిజి ) ఏం. వెంకటేశ్వరరావు,ఈ అత్యున్నత పురస్కారాన్ని అత్యంత వైభవంగా అందుకున్నారు.ఈ సందర్భంగా నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, కేంద్ర కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో విద్యా వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో పాడేరు ఐటీడీఏ నిరంతరం సాగిస్తున్న కృషిని, ప్రణాళికాబద్ధమైన విధివిధానాలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలోని మిగిలిన ఐటీడీఏలకు పాడేరు ఒక ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

సమిష్టి కృషికి దక్కిన గౌరవం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి.

అవార్డు అందుకున్న అనంతరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. "ఈ అవార్డు పాడేరు ఐటీడీఏ పరిధిలోని అధికారులు, సిబ్బంది, మరియు క్షేత్రస్థాయి సిబ్బంది అందరి సమిష్టి కృషి, అంకితభావానికి దక్కిన గౌరవం అని పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గిరిజన సంక్షేమమే ధ్యేయంగా రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి మరింత పట్టుదలతో పని చేస్తాం" అని పీఓ తెలిపారు.ఐటీడీఏ జాతీయ అవార్డు అందుకోవడం పట్ల పీఓకు అధికార్లు గిరిజన సంఘాలు అభినందనలు తెలిపారు.ది

## అరకులోయలో జేసి శ్రీ పూజ సుడిగాలి పర్యటన.



**అరకువేలీ/ పెన్ సత్తా, జూన్ 04:** యోగేంద్ర కార్యక్రమం పై ప్రత్యామ్నాయ స్థలం పరిశీలన,కొత్త రేషన్ షాపు ప్రారంభించిన జిల్లా


జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ గురువారం అరకు వ్యాలీ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ ప్రతిపాదనలపై ఆమె అధికారులతో సమీక్షించారు.

'యోగాంధ్ర క్యాంపెయిన్ 2026' స్థల పరిశీలన యోగాంధ్ర క్యాంపెయిన్ 2026" కార్యక్రమానికి సంబంధించి అరకు వ్యాలీ మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మాడగడ వ్యూ పాయింట్ ను జాయింట్ కలెక్టర్ గారు సందర్శించారు. మండల స్థాయి అధికారులతో కలిసి ?క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ప్రత్యామ్నాయ స్థలాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. అక్కడ పరిస్థితి వాతావరణం అను కూలత పై అధికారులతో

సమీక్ష, అనంతరం అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, భద్రత ఏర్పాట్లపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ?అరకు వ్యాలీ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపు ను జాయింట్ కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. రేషన్ ?డీలర్‌కు సరుకుల విక్రాలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ దుకాణం ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ అక్కడి డీలర్‌తో రేషన్ పంపిణీ, కచ్చితంగా ఉండాలని ఎలాంటి అవకతవ కులు చూసుకోవాలని ఆమె తెలిపారు.నిరుపేదలకు సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సరుకులను సకాలంలో, పారదర్శకంగా అందించాలని డీలర్‌ను ఆదేశించారు.?ఈ పర్యటనలో స్థానిక రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ది

## నేడు విశాఖలో సిఎం చంద్ర బాబు సైకిల్ పై హల్ చల్!.

పచ్చదన కోసం ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలి. సీఎం చంద్రబాబు.



**పెన్ సత్తా, జూన్ 04:** శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ గాలి నీరు నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ -సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను.

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం..

* నెర్రపల్లిలో ప్రత్యేక గ్రామసభ..



**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, పెన్ సత్తా, జూన్ 04**: నెర్రపల్లి గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభను ఎంపీడీవో ప్రమీల నాయక్ ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ గొడ్డెండ్ల హేమలత శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో సాలిడ్ మరియు లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, ప్లాంటేషన్ కార్యక్రమాలు, ఉపాధి హామీ పనులు, వ్యవసాయ పనులు, జీపిడీపీ యాక్షన్ ప్లాన్, తడి చెత్త--పొడి చెత్త వేరు చేయడం, సానిటరీ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం, అర్హులైన వారికి పెన్షన్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలపై కూడా గ్రామస్థులతో చర్చించారు. గ్రామసభను విజయవంతం చేసిన అందరికీ ఎంపీడీవో ప్రమీల నాయక్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం "అమ్మ పేరు మీద ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో, సర్పంచ్ చేతుల మీదుగా మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఉపసర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు పద్మ, అఖిల, రేణుక, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ రెడ్డి, పీఎస్సీ డాక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, రైతులు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రుగొండ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ

* సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కీలక ఆదేశాలు
* బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ






**భద్రాద్రి కొత్తగూడెం పెన్ సత్తా, జూన్ 04**: :చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు మరియు సిబ్బంది విధుల నిర్వహణ పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, స్టేషన్ రికార్డులను, క్రైమ్ ఫైల్స్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు . సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణా, త్రవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ ఇసుక రవాణా పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు.
?ప్రతి ఒక్క పోలీస్ అధికారి మరియు స్టేషన్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విధానాలను అలవర్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు .ఈ తనిఖీలో భాగంగా, స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి, తక్షణమే వారికి న్యాయం జరిగేలా చూడాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## జై గణేశ భక్తి సమితి చైర్మన్ గా అశోక్ పటేల్ నియామకం



**యాదగిరి : పెన్ సత్తా, జూన్ 04**: హైదరాబాద్, జూన్ 3: జై గణేశ భక్తి సమితి తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో చందానగర్‌కు చెందిన బాసెట్టి అశోక్ పటేల్‌ను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 76 డివిజన్ల జీహెచ్ఎంసీ ప్రాంతానికి ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు సమితి రాష్ట్ర చైర్మన్, జాతీయ వ్యవస్థాపకులు-అధ్యక్షులు కె.ఎస్. ఆనంద్ రావు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు.
సంస్థ అభివృద్ధి, భక్తి కార్యక్రమాల నిర్వహణ, గణేశ భక్తుల సమన్వయం కోసం అశోక్ పటేల్ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. సమితి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ భక్తి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అశోక్ పటేల్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆనంద్ పటేల్, కుమారస్వామి పటేల్, శ్రీనివాస్ పటేల్, రాజు పటేల్, ఉమారాణి, సునీతా రెడ్డి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## మంచాల తహసీల్దార్ కార్యాలయంలో పాత తెలంగాణ తల్లి చిత్రపటం ఏర్పాటు వివాదం..



**రంగారెడ్డి జిల్లా, మంచాల, పెన్ సత్తా, జూన్ 04**: రంగారెడ్డి జిల్లా మంచాల మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాత తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఉపయోగించడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నూతన తెలంగాణ తల్లి విగ్రహం, చిత్రపటాలను అధికారికంగా అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికీ పాత చిత్రపటాలనే ఉపయోగించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల్లో నూతన తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త చిత్రపటాలతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు జారీ చేసింది. అయినప్పటికీ మంచాల తహసీల్దార్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాత చిత్రపటంతో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడం అధికారుల ప్రధాన బాధ్యత అయినప్పటికీ, కొంతమంది అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా ఇదే నిర్లక్ష్యం కొనసాగుతోందని, ఇలాంటి ఘటనలు దానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. కార్యక్రమంలో దాదాపు పదిమంది అధికారులు పాల్గొన్నప్పటికీ, ఎవ్వరూ ఈ తప్పును గుర్తించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్ రావు, సీనియర్ అసిస్టెంట్ జగన్, ఆర్ఐలు శ్రీనివాస్, రమేష్, జూనియర్ సహాయకులు నాగరాజు, సహార, హేమంత్, వీఆర్ఏలు భాస్కర్, మణికంఠ, వెంకటయ్య, ఆపరేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, పెన్ సత్తా, జూన్ 04**: :ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించి కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ వంటి ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులందరూ తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి సహకరించాలి**

గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, మైపాల్ రెడ్డి, శ్రీనివాస్, రాజు గౌడ్, కీర్తి, ధనలక్ష్మి, సంధ్య, సెక్రెటరీ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విద్యాధరి, సురేష్ మోహన్ , ఏవో శ్యాం కుమార్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని నిర్మాణాలకు అండ ఎవరు..?....

* అధికారుల తీరుతో స్థానికుల్లో అనుమానం
* ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్ పెన్ సత్తా, జూన్ 04**: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొంపల్లి సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్, రామిరెడ్డి నగర్ ప్రాంతంలో భారీ స్థాయిలో చేపడుతున్న ఓ నిర్మాణంపై స్థానికులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నిర్మాణానికి సరైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.
స్థానికుల కథనం ప్రకారం, నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి సంబంధిత శాఖ అధికారులు ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా భారీ భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిర్మాణం విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై స్పష్టత లేదని స్థానికులు చెబుతున్నారు.
భవన నిర్మాణం రహదారికి అత్యంత సమీపంలో కొనసాగుతుండటంతో పాటు, సెట్‌బ్యాక్‌ల విషయంలో కూడా అనుమానాలు ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం కొనసాగుతున్నట్లయితే, సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల అండ ఉందా..?**

అనుమతులు లేకుండా లేదా అనుమతులకు మించి నిర్మాణం కొనసాగించడం సాధారణంగా సాధ్యం కాదని, దీనికి కొందరు అధికారుల మౌన సహకారం ఉండొచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని వారు పేర్కొంటున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

ఈ నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతుల పత్రాలను ప్రజల ముందుంచాలని, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్థల పరిశీలన చేపట్టి వాస్తవ పరిస్థితులపై నివేదిక విడుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అక్రమ నిర్మాణంగా తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
"నిబంధనలు సామాన్య ప్రజలకేనా? అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం.



● అర్జునాపురంలో వేగంగా కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియ

**కంచిలి పెన్ సత్తా, జూన్ 04**: మండలంలోని యక్కల గ్రామపంచాయతీ పరిధిలోని అర్జునాపురంగ్రామంలో గురువారం ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రక్రియ రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. ఎన్నో ఏళ్ళుగా భూముల సరిహద్దులు, రికార్డుల్లోని వ్యత్యాసాలు, యాజమాన్య వివాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు ఈరీసర్వేతో తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.
కేశరపాడుసచివాలయపరిధిలో సర్వేయర్లు జయప్రకాష్, పూర్ణ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో భూముల కొలతలు చేపడుతున్నారు. ప్రతి సర్వే నంబర్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తూ భూముల వాస్తవ స్థితిగతులను నమోదు చేయడం రైతుల్లో నమ్మకాన్ని పెంచుతోంది. భూముల సరిహద్దులపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడటంతో పాటు యాజమాన్య హక్కులు స్పష్టంగా నమోదు కానుండటంతో భవిష్యత్తులో వివాదాలకు తావుండదని రైతులు భావిస్తున్నారు.
రీసర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతోఅందుబాటులోకి రావడం వలన రైతులకు రుణాల మంజూరు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ లావాదేవీల నిర్వహణలో సౌలభ్యం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. భూమికి సంబంధించిన అధికారిక రికార్డులు పారదర్శకంగా మారడం వల్ల రైతులకు భద్రత, నమ్మకం పెరుగుతుందనిఅంటున్నారు.
ఈ సందర్భంగా బుడ్డెపు. కామేష్ రెడ్డి మాట్లాడుతూ రైతుల దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమం అభినందనీయమన్నారు. భూ రికార్డులపారదర్శకతపెరగడంతో పాటు రైతుల హక్కులు మరింత బలోపేతం అవుతాయని,భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం అర్జునాపురంలో రీసర్వే పనులువేగంగాకొనసాగుతుండగా రైతులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై గ్రామ ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, రైతుల ఎన్నో ఏళ్ల సమస్యలకు ఈ రీసర్వే ఒక శాశ్వత పరిష్కార మార్గంగా నిలుస్తుందని గ్రామస్తులుఅభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,సచివాలయ సిబ్బంది,రైతులు,గ్రామస్తులుపాల్గొన్నారు.

# పాడి రైతుల ప్రగతికి హెరిటేజ్ భరోసా

- రైతే కేంద్రబిందువుగా సంక్షేమ పథకాలు
- పాల ఉత్పత్తిదారుల అభివృద్ధే సంస్థ లక్ష్యం
- అధిక పాల సరఫరాదారులకు ఘన సన్మానం
- రీజనల్ మేనేజర్ పి. తులసినాయుడు

**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 04**:గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా నిలిచిన పాడి రైతుల అభ్యున్నతే తమ ప్రధాన ధ్యేయమని హెరిటేజ్ డెయిరీ రీజనల్ మేనేజర్ పి. తులసినాయుడు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, ఆర్థిక భద్రత, స్థిరమైన ఆదాయం కోసం హెరిటేజ్ డెయిరీ అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అచ్యుతాపురం మండలం భోగాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన పాడి రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ఈ సందర్భంగా హెరిటేజ్‌కు అత్యధికంగా పాలు సరఫరా చేసిన రైతులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని పైలా సతీష్, రెండో బహుమతిని లాలం రమణ, మూడో బహుమతిని పైలా సర్వేశ్వరరావు, నాలుగో బహుమతిని రాజాన అప్పలనాయుడు అందుకున్నారు.
రైతులే దేశ ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలని పేర్కొన్న తులసినాయుడు, పాల నాణ్యత పెంపు, మలినాలు కలవకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, పశుపోషణలో ఆధునిక పద్ధతులు, పాల ఉత్పత్తి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రతి పాల ఉత్పత్తిదారుడి కుటుంబానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు.
రైతు భద్రతకు ప్రత్యేక పథకాలు
హెరిటేజ్ డెయిరీ స్థానిక మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ జిల్లాలోని ఇతర డెయిరీలతో పోలిస్తే హెరిటేజ్ రైతులకు మెరుగైన ధరలు చెల్లిస్తోందన్నారు. పాల సరఫరా చేస్తున్న రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, సహజ మరణమైతే రూ.50 వేల ఆర్థిక సాయం నామినీకి అందజేస్తున్నట్లు వెల్లడించారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు హెరిటేజ్



డెయిరీ కృషి చేస్తోందన్నారు. హెరిటేజ్ సేవలు గ్రామాల్లో మరింత విస్తరించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాలు పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సీహెచ్. రాము, సూపర్వైజర్ సీహెచ్. గోవింద్, ఆర్. రమణ, కే. అప్పలనాయుడు, డి. మహాలక్ష్మి, డి. చిన్నతల్లి, డి. బాల, పీ. దేవుడమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# "వెన్నుపోటుకు రెండేళ్లు" వైఎస్సార్‌సీపీ భారీ నిరసన ర్యాలీ.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు

**కంచిలి పెన్ సత్తా, జూన్ 04**:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలఅమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కంచిలి మండల కేంద్రంలోభారీనిరసనర్యాలీనిర్వహించారు."వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు,కార్యకర్తలు,యువత,పెద్దసంఖ్యలోపాల్గొనిప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కంచిలిఎంపీపీ పైల. దేవదాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడువజ్జ మృత్యుంజయ రావుఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కంచిలి స్టేట్ బ్యాంక్ కూడలి వద్ద ప్రారంభమై ప్రధాన రహదారుల గుండా రైల్వే స్టేషన్ ఆవరణలోని మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు కొనసాగింది. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు కూటమిప్రభుత్వానికి వ్యతిరేకంగానినాదాలు చేస్తూ ముందుకుసాగారు.అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద



మానవహారంనిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమిప్రభుత్వంపూర్తిగావిఫలమైందని విమర్శించారు.సంక్షేమ పథకాలఅమలు,రైతుసంక్షేమం, ఉపాధిఅవకాశాలకల్పన,అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం ఆశించినస్థాయిలోపనిచేయలేదనిఆరోపించారు.జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి.కృష్ణారావుమాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలకు పొంతనలేదనివిమర్శించారు. వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడువజ్జ.మృత్యుంజయ రావు మాట్లాడుతూ ప్రజలకు వాస్తవపరిస్థితులను వివరించడం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులుదుర్గాసి.ధర్మారావు, గుమ్మడి.రామదాసు,మండలపార్టీ ఉపాధ్యక్షులుతలగాన.తిరుపతిరావు,లడ్డుకేశవ.మహాపాత్రో,నాయకులుకొణపల.సురేష్,మడ్డువెంకటరావు,కొల్లిఈశ్వరరావు,పలికల.జయరాం,గణప.సింహాచలం,డొక్కర.బలరాం,ఎలుసూరి.అప్పారావు,వజ్జ. త్యాగరాజుతదితరులుపాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు,అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సూపర్ సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం దూరం....







**చోడవరం పెన్ సత్తా, జూన్ 04**::నేటి కి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కాగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెండు సంవత్సరాలు పూర్తికాగా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలను బాబు వెన్నుపోటుకు రెండు సంవత్సరాలు కార్యక్రమాన్ని నిర్వహించమని ఆదేశాలు ఇవ్వగా మాజీ మంత్రి ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చోడవరం నియోజవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ పిలుపుమేరకు గురువారం చోడవరం హెడ్ క్వార్టర్ లో చోడవరం మండల పట్టణ నాయకులతో కొత్తూరు జంక్షన్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ర్యాలీగా వెళ్లి జంక్షన్లో మానవహారం నిర్వహించి, బాబు పాలన రెండేళ్లలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటుగా భావించాలని కోరుతూ కళ్ళకి గుంతలు కట్టుకొని శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు లమ్మ , గాంధీ గ్రామం మాజీ సర్పంచ్ గాడి అప్పారావు,మండల అధ్యక్షులు సరిగడం చిన్ననాయుడు, చోడవరం వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ( సత్య), మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పాడేరు నియోజకవర్గం పరిశీలకులు ఏడువాక సత్యారావు, సీనియర్ లీడర్ వేంపల్లి ఆనంద్, మాజీ డిసిసి చైర్మన్ పల్లా నర్సింగరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గునూరు రామచంద్ర నాయుడు, అనకాపల్లి జిల్లా యువజన అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, వైఎస్ఆర్సిపి మండల నాయకులుమొల్లు సోమనాయుడు, జిల్లా నాయకులు ఓరుగంటి నెహ్రూ, చవితిన బాబురావు, చోడవరం పట్టణ యువజన అధ్యక్షుడు గూనురు రాజు, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఉప్పల బాబు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు లింగ బాబు, మాజీ జెడ్పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, రైతు విభాగ అధ్యక్షుడు బొడ్డు శ్రీరామమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు బొగ్గు శ్యామలమ్మ, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వేచలపు ప్రకాష్, శ్రావణ్, పి ఎస్ పేట వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు దన్నిన వెంకట్రావు, సూర్య ప్రకాష్, బూత్ కన్వీనర్ సత్తిబాబు తలారి, గరిక గోవింద, బొగ్గు చందు, చందు రాంబాబు మండల నాయకులు, కాశి దొడ్డివీధి, సత్తిబాబు అన్నవరం,మరియు చోడవరం పట్టణ మండల వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు..



# అలరించిన గానామృతం.

✸ గానగంధర్వుడు బాలు జయంతి సందర్భంగా కళాభారతి సంగీత నివాళి



**పెన్ సత్తా, జూన్ 04**:కంచిలి మండలం జాడుపూడి గ్రామంలో గురువారం సంగీత అభిమానులకు ఓ మధురానుభూతి కలిగింది. గానగంధర్వుడు,పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్.పి. బాలసుబ్ర హ్మణ్యం (బాలు)జయంతి సందర్భంగా "కళాభారతి' కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సంగీత విభావరిలో "బాలు" గారి అమర గీతాలు మార్మోగి, ఆయన గాన వైభవాన్ని మరోసారి శ్రోతల ముందుకు తీసుకొచ్చాయి.తెలుగు సినీ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన బాలుగారికి సంగీతనివాళిగా నిర్వహించిన ఈకార్యక్రమంలో స్థానిక కళాకారులు ఆయన ఆలపించిన ఎన్నో ప్రజాదరణ పొందిన పాటలు పాడి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. భక్తి, ప్రేమ,జానపద,మెలోడీ గీతాలతో సాగిన ఈ సంగీత విభావరి ఆద్యంతం శ్రోతలను ఆకట్టుకుంది. ఈసందర్భంగాపిలక.సోమేశ్వర రావు మాట్లాడుతూ బాలు గారి స్వరం కేవలం ఒక గాయకుడి గాత్రం మాత్రమేకాదని,కోట్లాది మంది సంగీతాభిమానుల భావోద్వేగాలకు ప్రతిరూపమనిపేర్కొన్నారు. భాషలకతీతంగా వేలాది పాటల ద్వారా భారతీయ సంగీత రంగానికి ఆయన అందించినసేవలు చిరస్మరణీయమని కొనియాడారు.కళాభారతి కళాకారులు మాట్లాడుతూ బాలు గారి పాటలు కాలం మారినాప్రజల హృదయాల్లో చిరస్థాయిగానిలిచి ఉంటాయని, యువతకు ఆయన సంగీత ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమానికి హాజరైన సంగీతాభిమానులు బాలు గీతాలను ఆస్వాదిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.
ఈ కార్యక్రమంలో కళాభారతి సభ్యులు, స్థానిక కళాకారులు పిలక సోమేశ్వరరావు, పిలక.చిన్నబాబు, సంగీతాభిమానులు,గ్రామపెద్దలు,యువత పెద్దసంఖ్యలోపాల్గొన్నారు.

## నేడు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం.

✸ వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాస్.



**పెన్ సత్తా, జూన్ 04**:: మేజర్ పంచాయతీ పరవాడ సంతబయులు వద్ద వైయస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు ఆధ్వర్యంలో చంద్రబాబు పాలన వైఫల్యాలను ఎండగడుతూ వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన అబద్ధపు వాగ్దానాలను అమలు చెయ్యిలేని హామీలను అలాగే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన మోసపూరిత హామీల బాండ్లు ను ప్రజలు కు అర్థమయ్యేలా వివరించి ప్రజల సమక్షంలో మానవహారం నిర్వహించి టి.డి.పి మేనిఫెస్టో ను మోసపూరిత బాండ్లు ను తగలబెట్టి నిరసన కార్యక్రమం నిర్వహించబడునని వెల్లడించారు. ముఖ్య అతిథులు గా పెందుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ , ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున మండలం లో గల వైఎస్ఆర్సిపి ఎంపీపీ, జడ్పీటీసీ , వైస్ ఎంపీపీ లు, మాజీ సర్పంచ్ లు , ఎంపీటీసీ లు, మాజీ ఎంపీటీసీ లు , అనుబంధ విభాగ ల లో నియమితులైన నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని క
విజయవంతం చేయాలని కోరారు.

## రూరల్ పోలీస్ స్టేటస్ పరిధిలో గంజాయి పట్టివేత.

✸ ముగ్గురు అరెస్ట్, కారు స్వాధీనం.




**పెన్ సత్తా, జూన్ 04**:నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో ఎస్సై రాజారావు మరియు సిబ్బంది గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ ముఠా పట్టుబడింది.
?కేసు వివరాలు సీఐ రేవతమ్మ తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుడైన బోధ శ్రీను, గతంలోనూ గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతను ఒరిస్సాలోని చిత్రకొండ ప్రాంతంలో 26 కేజీల గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. ఆ గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలించేందుకు తన సహచరులైన రమణమూర్తి మరియు గణేష్ కుమార్ సహాయం తీసుకున్నాడు.
?ఖచ్చితమైన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా, గంజాయిని కారులో తరలిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 26 కేజీల గంజాయి, ఒక కారు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆమె హెచ్చరించారు.

పెన్ సత్తా
PEN SATTA Telugu Daily
శుక్రవారం 5 జూన్ 2026

# మహబూబాబాద్ జిల్లాకు 4వేల గంజాయి టెస్టింగ్ కిట్స్ ..ఎస్ పి డా, శబరీష్

జర్నలిస్ట్ మిర్రర్ పత్రిక మహా బాద్ జిల్లా ప్రతినిధి ౼:అనుమానం వస్తే అక్కడికక్కడే పరీక్షలు..పదినిమిషాలలో గంజాయి, మత్తుమందులు వాడేవారి ఫలితాలు ఇక పైన ప్రతి పోలీస్ అధికారి వెంట ఉండనున్న ఈ..ప్రత్యేక కిట్ లు.. వ్యక్తులను శిక్షించడం కాదు..., వ్యవస్థను మార్చాలన్నదే మా..ఆలోచన. అందుకే డి-అడిక్షన్ సెంటర్ ల ద్వారా గంజాయి తాగేవారిలో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.. మహబూబాబాద్ జిల్లాను సంపూర్ణ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యం.. ఇది కేవలం నాలుగురోజులు నౌఖరి చేసి పోవడానికి వచ్చిన మా..లక్ష్యం మాత్రమే కాకూడదు...!, మన మహబూబాబాద్ జిల్లా అనుకునే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నదే నా..కోరిక...!! మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ జర్నలిస్ట్ లు ఉన్నారు. ప్రతి అంశాన్ని వెలికితీయగల.., వెలుగులోకి తేగల సమాచార వ్యవస్థ వారి..స్వంతం.. ఇది మీ..జిల్లా, మీ..జిల్లాను.., మీ..యువతను, రేపటి భవిత ను చక్కదిద్దడంలో మీ..వంతు పాత్ర పోషించాలి.., జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లందరూ తమ బాధ్యత గా సంపూర్ణ గంజాయి రహిత జిల్లాగా మహబూబాబాద్ ను మార్చే మా...ప్రయత్నంలో కీలకపాత్రదారులు కావాలి... జిల్లాలో ఎక్కడైనా గంజాయి



విక్రయం, వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించండి., సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం... అక్రమరవాణాను ఆదాయవనరుగా భావిస్తున్న నేరస్తుల పట్ల అత్యంత కఠినంగా ఉంటాం.., తెలిసి, తెలియక దారితప్పిన యువతను డిఆడెక్సన్ సెంటర్ ల ద్వారా సరియైన దారిలో పెట్టే ప్రయత్నం చేస్తాం... ప్రతిక్షణం మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం మీకు అందుబాటులో ఉంటుంది..., మంచి మార్పును కోరుకునే ప్రజలు, మేధావులు, విద్యాసంస్థల నిర్వాహకులు, అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగులు, జర్నలిస్ట్ లు పోలీస్ శాఖ తో కలిసి కదలాలి.., మన.. మహబూబాబాద్ జిల్లాను మనమే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందాం అనే ఆలోచనతో ముందుకు



రావాలి..., అంతా కలిసికదిలితే మత్తు పదార్థాలు, గంజాయి మానుకోట జిల్లా పొలిమేర ను కూడా తాకలేవు.., కలిసికదులుదాం.., రేపటి ఉజ్వల భవిష్యత్తు దారి తప్పకుండా కాపాడుకుందాం. మహబూబాబాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్..

# ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్‌డరోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు గ్రామంలో ఉన్న బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివరణకు కృషి చేయలి

మాధకద్రవ్యాల నిర్మలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామ సభలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**రాజన్న సిరిసిల్ల** : ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షితమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకొని పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌డరోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నరు. వాహనదారులు తమ స్వీయారక్షణార్థం,కుటుంబ క్షేమం కొసం తప్పని సరిగా హెల్మెట్ సిట్ బెల్ట్ ధరించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నపడం, ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని,మైనర్ డ్రైవింగ్ పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు గ్రామాల్లో ఉన్న రహదారి భద్రతా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీల పాత్ర కీలకమని తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలు జిల్లా షి టీమ్



సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్, కాలేజ్,పని చేసే ప్రదేశాల్లో మహిళలు విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులు ఎదురుకుంటే నిర్భయంగా షి టీమ్ నంబర్ 87126 56425 నంబర్ ని సంప్రదించాలని సూచించారు.భరోసా కేంద్రం ద్వారా లీగల్, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని తెలిపారు.మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తు మాధకద్రవ్యాల నిర్మలనలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేందర్ చారి, వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు

# అమీర్ పేటలో ఘోర అగ్ని ప్రమాదం
# 20కిపైగా దుకాణాలు దగ్ధం

<u>హైదరాబాద్</u> : హైదరాబాద్ సిటీ నడిబొడ్డు అమీర్‌పేటలో మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. అవి ఆర్పేలోపు మొత్తం ఆ బిల్డింగ్‌లో ఉన్న అని దుకాణాలకు వ్యాపించాయి. చుట్టుపక్కల షాపులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. భారీగా ఎగసిపడుతున్న మంటలు కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న ఖాఖీ ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణానికి అంటుకోవడంతోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. మొత్తం బిల్డింగ్ మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోయింది. భగభగ మండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం అగ్నిమాప సిబ్బంది భయపడిపోయారు. బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురి చేశాయి. మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిద అయ్యింది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. వీటిలో 20కిపైగా షాపులు కాలిబూడిదైనట్టు తెలుస్తోంది. మండే ఎండలకు మంటలు చుట్టుపక్కల ఉన్న షాపులకు వ్యాపించాయి. మంటల ధాటికి చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు అందరూ వారి షాపుల్లోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి పరుగులు తీశారు.




**భారీగా ట్రాఫిక్ జామ్**

విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ఖాఖీ ఫ్యాషన్స్ షాపులో అన్నీ దుస్తులు కావటంతో మంటల స్థాయిలో తీవ్రంగా ఉందంటున్నారు అధికారులు. పొగ, మంటలు కారణంగా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మార్గాంలో వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.

## మలోత్ శారద, నీల కుటుంబ సభ్యులని ఓదార్చిన ప్రభుత్వ విప్ డా, రామచంద్ర నాయక్



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి భుక్యతండా కు చెందిన మాలోత్ శారద (40), మాలోత్ నీల (42) అనుమానాస్పదంగా మరణించారు. తండాకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చిన డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్..లి

## ప్రజాసేవకు రథసారథి కామ్రేడ్ ఎల్లంకి లక్ష్మీనారాయణ: సిపిఐ నేతలు



సీనియర్ నాయకులు రాంపురం గ్రామ ముద్దుబిడ్డ కామ్రేడ్ ఎల్లంకి లక్ష్మీనారాయణ ఐదో వర్ధంతి వేడుకలను గార్ల మండలం వారి స్మారక స్థూపం వద్ద నిర్వహించారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని గ్రామంలోని లక్ష్మీనారాయణ స్మారిక స్థూపం వద్ద సిపిఐ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్లంకి లక్ష్మీనారాయణ తన జీవితాంతం పేద ప్రజల పక్షాన కార్మిక కర్షక వర్గాల హక్కుల కోసం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు. రాంపురం గ్రామం నుండి ఎదిగే నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమించిన ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. లక్ష్మీనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళులు అని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, సింగ్ రమేష్ దార్ల నాగేష్, లావుడియా బీముడు, గుండా సుధాకర్ రెడ్డి, చిరుమర్తి నాగరాజు,లాలు,వెంకన్న, సిపిఐ స్థానిక నాయకులు కార్యకర్తలు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు అభిమానులు మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

## ఈ వారంలో ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్

<u>హైదరాబాద్</u> : తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇక ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు విద్యాశాఖ కీలక సమాచారం వెల్లడించింది. ఫలితాలను మరో 5 రోజుల్లోనే వెల్లడించనున్నట్లు తెలిపింది. అంటే జూన్ 10వ తేదీలోపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు ఇంటర్ బోర్డు విడుదల చేయనుంచి. ఈ మేరకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన తుది సాంకేతిక కసరత్తు జరుగుతుంది. వచ్చే వారంలో ఫలితాలు వెల్లడించనున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా మే 12 నుంచి మే 21 వరకు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు గరిష్ట స్థాయిలో మొత్తం 3,98,358 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ఫలితాలు వెలువడితేగానీ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవదు. దీంతోపాటు డిగ్రీ ప్రవేశాలు, ఇతర ఉన్నత విద్యా అడ్మిషన్ ప్రక్రియలు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఫలితాలను త్వరగా ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు.కాగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,98,358 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. దీంట్లో జనరల్ విభాగంలో మొత్తం 3,69,294 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 28,703 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఫస్టియర్ విద్యార్థులు 2,67,141 మంది ఉండగా.. సెకండియర్ నుంచి 1,30,856 మంది విద్యార్థులు ఉన్నారు. అటు ఏపీలో మే 21వ తేది నుంచి మొదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 4వ తేదీతో అంటే నేటితో ముగియనున్నాయి.

## ప్రకాష్ రాజ్‌కు ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్

<u>హైదరాబాద్</u> : నటుడు ప్రకాష్ రాజ్‌కు ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రీసెంట్‌గా పవన్ కల్యాణ్ తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పడంపై ప్రకాష్ రాజ్ పరోక్షంగా పోస్ట్ చేయగా దీనికి తనదైన శైలిలో గట్టిగా ఆన్సర్ ఇచ్చారు గణేష్. 'రండి దొర రండి... కానీ వచ్చే ముందు ఉత్తుత్తినే వస్తున్నారా? పొత్తుతో వస్తున్నారా? లేదా సింగల్‌గా వస్తున్నారా? అది చెప్పి రండి. మీరొస్తానంటే మేమొద్దంటామా?' అంటూ పోస్ట్ చేశారు ప్రకాష్ రాజ్.దీనికి బండ్ల గణేష్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రకాష్ రాజ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రతీ దాంట్లో జోక్యం చేసుకునేందుకు మీరెవరు? అని ప్రశ్నించారు. 'నీకెందుకురా ప్రతీ దాంట్లో వేలు పెట్టడం? అసలు నువ్వెవడివి? తమిళోడివా? తెలుగోడివా, కన్నడోడివా? నీ ఊరు ఏది? నీ కథ ఏంటి? ప్రతీ ఊర్లో, ప్రతీ ఇష్యూలో దూరి జడ్జిమెంట్స్ ఇవ్వడానికి నువ్వేమైనా కలెక్టర్‌వా దేశ ప్రధానివా?ఎక్కడ చూసినా నువ్వే, ఏ విషయం వచ్చినా నువ్వే, నీ బతుక్కి పని లేకపోతే చూసుకో, కానీ అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో, తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చెయ్.' అంటూ ట్వీట్ చేశారు. దీనిపై నెటిజన్లు కొందరు బండ్ల గణేష్‌కు సపోర్ట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

## అరుణాచలం బాలికపై గ్యాంగ్ రేప్

<u>హైదరాబాద్</u> : అరుణాచల గిరి ప్రదక్షిణ బాటలో కేవలం ఒక రోజు వ్యవధిలోనే ఇద్దరు యువతులపై ఒకే దండగుల ముఠా అత్యంత అమానుషంగా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. మే 30న ఒక వివాహితపై, ఆ మరుసటి రోజు మే 31న మరో 23 ఏళ్ల యువతిపై మారణాయుధాలతో దాడి చేసి, సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. అంతటితో ఆగకుండా బాధితులను నగ్నంగా వీడియోలు తీసి, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం, నగలు దోచుకోవడం వంటి దారుణాలు భక్తుల భద్రత ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది. పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినప్పటికీ, పవిత్ర క్షేత్రంలో ఇలాంటి నేరాలు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది.గడిచిన కొన్నేళ్లుగా అరుణాచలానికి వచ్చే భక్తుల సంఖ్య లక్షల కు చేరింది. ముఖ్యంగా ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అయితే, దానికి అనుగుణంగా స్థానిక యంత్రాంగం మౌలిక వసతులు కానీ, సీసీటీవీ కెమెరాల నిఘా కానీ, తగినంత పోలీసు బలగాలను కానీ ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 14 కిలోమీటర్ల పొడవైన గిరి ప్రదక్షిణ మార్గంలో కొన్ని ప్రాంతాలు, బైపాస్ రోడ్లు రాత్రి వేళల్లో పూర్తి చీకటి మయంగా మారుతున్నాయి. ఈ అంధకారాన్నే ఆసరాగా చేసుకుని స్థానిక జులాయిలు, గంజాయి ముఠాలు భక్తులను టార్గెట్ చేస్తున్నాయి.అరుణాచలానికి వచ్చే భక్తులలో అత్యధిక శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాల నుంచే వస్తున్నారు.

## సంపాదకీయం

# డిజిటల్ భీభత్సం

ప్రగతికి బాటలు వేయాల్సిన కృత్రిమ మేధ, నేరగాళ్ల చేతికి చిక్కి డిజిటల్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ఒకప్పుడు సంక్లిష్టమైన కోడింగ్ నైపుణ్యమున్న సాంకేతిక నిపుణులకే సాధ్యమైన హ్యాకింగ్, నేడు అక్షరం ముక్కరాని వాళ్లకూ సులువైపోయింది. రానున్న రోజుల్లో ఏఐ ఆధారిత సైబర్ దాడులు ఏకంగా 400 శాతంమేర విజృంభిస్తాయని, 2026 చివరినాటికి వాటివల్ల జరిగే నష్టం లక్ష కోట్లను దాటుతుందన్న అంచనాలు ముప్పు తీవ్రతకు నిలువుటద్దం! 2025లో భారత్‌లో సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయి. 28.15 లక్షల కేసులు నమోదై.. కోల్పోయిన సొమ్ము రూ.22,495 కోట్లకు చేరింది. 2025లో భారత్‌లో వారానికి సగటున 3,195 సైబర్ దాడులు జరిగాయని చెక్ పాయింట్ సాఫ్ట్‌వేర్ నివేదిక హెచ్చరించింది. పటిష్ఠంగా ఉన్నాయని భావిస్తున్న డిజిటల్ భద్రతా కవచాలు సైతం ఏఐ దాడులను నిరోధించలేకపోతున్నాయి. సైబర్ నేరాలవల్ల ప్రపంచవ్యాప్తంగా 2025లో అంచనా వేసిన నష్టం 10.29 లక్షల కోట్ల డాలర్లు కాగా, 2026 నాటికి అది 11.36 లక్షల కోట్ల డాలర్లకు చేరొచ్చని అంచనా. డిజిటల్ విప్లవం వెలుగుల్లో నేరాలు కూడా. దేదీప్యమానమవుతున్నాయి.

జనరేటివ్ ఏఐ రాకతో ఫిషింగ్ దాడులు కొత్తరూపు సంతరించుకున్నాయి. గతంలో స్పామ్ మెయిల్స్‌లో భాషా దోషాలుండేవి. తద్వారా వాటిని గుర్తించడం సులభంగా ఉండేది. కానీ ఇప్పుడు ఏఐ సాయంతో అచ్చం అధికారిక మెయిల్స్‌ను తలపించేలా, ఏమాత్రం తప్పుల్లేని సందేశాలు సృష్టిస్తున్నారు. డీప్‌ఫేక్ ఫిషింగ్ దాడులు 2025లో ఏకంగా 138 శాతం పెరిగాయి. వీటన్నింటికంటే భీతి గొల్పుతున్న అంశం డీప్‌ఫేక్ సాంకేతికత. కేవలం మూడు సెకన్ల ఆడియో ఉంటే చాలు, ఎదుటి వ్యక్తి గొంతును అచ్చుగుద్దినట్టు దించేయవచ్చు. 2025 విశ్లేషణ ప్రకారం 47 శాతం భారతీయ వయోజనులు ఏఐ వాయిస్ క్లోనింగ్ లేదా డీప్‌ఫేక్ మోసానికి గురయ్యారు. ఇది ప్రపంచ సగటు 25 శాతానికి దాదాపు రెట్టింపు. 2025లో భారత్‌లో డీప్‌ఫేక్ మోసాలవల్ల నష్టం రూ.70,000 కోట్లు అవుతుందని అంచనాలున్నాయి. కంటికి కనిపించేది నిజం కాదు. చెవికి వినిపించేది సత్యం కాదు అన్నట్లు -పిల్లల గొంతుతో తల్లిదండ్రులను భయపెట్టి డబ్బులు వసూలు చేయడం, కంపెనీ అధినేతల ముఖాలతో వీడియో కాల్స్ సృష్టించి కోట్లు కాజేయడం డిజిటల్ ప్రపంచంలో విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. హాంకాంగ్‌లో ఓ బహుళజాతి సంస్థ ఆర్థిక విభాగం ఉద్యోగి, తన సీఎఫ్ఓతోపాటు సహోద్యోగులంతా పాల్గొన్నట్టు కనిపించిన వీడియో కాల్ నిజమేనని నమ్మి రూ.200 కోట్లు బదలాయించాడు. అది మొత్తం డీప్‌ఫేక్ మోసం. భారత్‌లో 65 శాతం సంస్థలు డీప్‌ఫేక్ ఆధారిత దాడులను ఎదుర్కొన్నాయని 2026 థేల్స్ డేటా థ్రెట్ నివేదిక స్పష్టం చేసింది. 55 శాతం సంస్థలు ఏఐ తప్పుడు సమాచారంవల్ల నష్టపోయాయి. సామాజిక మాధ్యమాల్లో మనం వదిలే సమాచారాన్ని ఏఐ క్షుణ్ణంగా విశ్లేషిస్తోంది. ఎవరి ఆర్థిక స్థితిగతులు ఏమిటి? ఎవరి బలహీనతలేంటి? వంటి అంశాలను బేరీజు వేసి మరీ సైబరాసురులు వల విసురుతున్నారు. మనుషులు ఊహించలేనంత సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌లను సైతం ఏఐ అల్గారిథమ్‌లు సెకన్ల వ్యవధిలో ఛేదిస్తున్నాయి. విద్యా సంస్థలు వారానికి సగటున 7,684 సైబర్ దాడులను, ప్రభుత్వ సంస్థలు 4,912 దాడులను ఎదుర్కొంటున్నాయి. అక్టోబర్ 2024 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య 26.5 కోట్లకు పైగా మాల్‌వేర్ ముప్పులు గుర్తించబడ్డాయి. అంటే నిమిషానికి సగటున 505 దాడులు జరిగినట్లు. 2026లో మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ అత్యధికంగా దెబ్బతిన్నాయి. ఆర్థిక సంస్థలు, ఐటీ మౌలిక వ్యవస్థ, ప్రభుత్వ డేటాపై లక్ష్యిత దాడులు పెరిగాయి.

స్వయంగా నిర్ణయాలు తీసుకుని పనులు చక్కబెట్టే ఏజెంటిక్ ఏఐ వైపు సాంకేతికత అడుగులేయడం విప్లవాత్మకమైన మార్పే అయినప్పటికీ, మానవ పర్యవేక్షణలేని ఈ స్వయంప్రతిపత్తి కత్తిమీద సాము వంటిదే. బ్యాంకింగ్, వైద్యం, విద్యుత్ గ్రిడ్లవంటి కీలక రంగాల్లో ఈ డిజిటల్ ఏజెంట్లు చేసే చిన్న పొరపాట్లు పెను ఆర్థిక నష్టాలకు, భద్రతాపరమైన విపత్తులకు దారితీసే ప్రమాదముంది. ఏఐ-ఆధారిత మోసాలు సాంప్రదాయ ధృవీకరణ వ్యవస్థలను సునాయాసంగా దాటేస్తున్నాయి. అధికారులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, వినియోగదారులను అచ్చంగా అనుకరిస్తూ ఖాతా స్వాధీనం, మోసపూరిత చెల్లింపులు చేయిస్తున్నారు. రక్షణ గోడలే కూలిపోతున్న తరుణంలో సామాన్యుడి భద్రత గాలిలో దీపమే అవుతోంది.

ఏఐ సృష్టించే ముప్పులను అదే సాంకేతికతతో తిప్పికొట్టాలి. బ్యాంకింగ్ రంగంలో మ్యూల్ అకౌంట్లను పసిగట్టేందుకు ఆర్బీఐ 'మ్యూల్ హంటర్ ఏఐ' టూల్ రూపొందించడం శుభపరిణామం. టెలికాం సంస్థలు కూడా ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్‌కు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక టూల్స్ రూపొందించాలి. యూపీఐ మౌలిక వ్యవస్థపై నెలకు 1,500 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఇది సైబర్ నేరగాళ్లకు అత్యంత విలువైన లక్ష్యం. దొంగిలించబడిన నిధుల రికవరీ రేటు దేశవ్యాప్తంగా కేవలం 10-12 శాతం మాత్రమే. భారత్‌లో డిజిటల్ భద్రతపై అవగాహన తక్కువ. భారత్‌లో ఏఐ వాయిస్ స్కామ్ బాధితుల్లో 83 శాతం ఆర్థిక నష్టానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో సెర్ట్-ఇన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కృత్రిమ మేధను ఎదుర్కొనే సురక్షిత డిజిటల్ కవచాలు నిర్మించాలి. నాస్కామ్, ఐఎస్‌బీవంటి సంస్థలతోపాటు పారిశ్రామిక దిగ్గజాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ప్రభుత్వంతో కలిసి ఈ ప్రమాదాలపై నిరంతర అధ్యయనం, పరిశోధనలు సాగించాలి. ఏఐ సైబర్ సవాళ్లను ఎదుర్కోవడానికి జాతీయస్థాయిలో శక్తిమంతమైన విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి ఏఐ ఏజెంట్‌కు కచ్చితమైన డిజిటల్ గుర్తింపు ఉండటంతో పాటు వాటి ప్రతి కదలికను నిశితంగా పర్యవేక్షించే లాగింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఆటోమేషన్ వేగంకంటే జవాబుదారీతనంతో కూడిన భద్రతే పరమావధిగా కఠినమైన నిబంధనలు, నమ్మకమైన ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించాలి. ఎంతటి అత్యాధునిక వ్యవస్థలైనా, కీలక నిర్ణయాలపై నియంత్రణ మాత్రం మనిషి చేతిలోనే ఉండాలి. ప్రజల్లో డిజిటల్ విజ్ఞత పెరగాలి. కృత్రిమ మేధ మానవాళికి అపురూప వరమవుతుందా? నేరగాళ్ల చేతిలో విధ్వంసకర ఆయుధంగా మారుతుందా? అనేది మన సన్నద్ధతపైనే ఆధారపడి ఉంది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే మన డిజిటల్ భవిష్యత్తు అంధకారంలోకి జారిపోవడం ఖాయం!

# జపాన్.. కొత్త మేల్కొలుపు!?



రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల దెబ్బకు మోకరిల్లిన జపాన్, శాంతి రాజ్యాంగాన్ని రాసుకుని దశాబ్దాల పాటు నిరాయుధంగా నడిచింది. కానీ నేడు అదే జపాన్, మళ్లీ పదునైన కత్తిని చేతపట్టుకుంటోంది. సొంత సీఐఏ నిర్మించుకుంటోంది. హైపర్‌సోనిక్ క్షిపణులు తయారు చేసుకుంటోంది. ఆరోతరం యుద్ధ విమానాలు రూపొందిస్తోంది. ఆసియాలో కొత్త భూకంపం మొదలైంది. అది జపాన్ మేల్కొలుపు!

1945లో రెండో ప్రపంచ యుద్ధంలో పరాజయం తర్వాత, అమెరికా ఆధ్వర్యంలో జరిగిన సంస్కరణలు జపాన్ రాజ్యాంగంలో ఒక విప్లవాత్మక అధ్యాయం రాశాయి. ఆర్టికల్ 9.. యుద్ధాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించిన ఆ నిబంధన ప్రకారం, జపాన్ ఎటువంటి సైనిక దళాలను నిర్వహించకూడదు. దాడి చేసే విధానాలు అనుసరించకూడదు. ఇది ఒక ఓడిపోయిన దేశంపై విజేతలు విధించిన నిబంధన. అయితే శీతల యుద్ధ కాలం నుండి, ముఖ్యంగా 1990ల తర్వాత, జపాన్ ఆ రాజ్యాంగాన్ని క్రమంగా సరళంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. "సమిష్టి ఆత్మరక్షణ" అనే భావన ద్వారా, దాడికి గురైన మిత్ర దేశాలకు సైనిక సహాయం చేయవచ్చని నిర్వచించుకుంది. జపాన్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్సెస్ (జేఎస్‌డీఎఫ్) క్రమంగా శక్తిమంతంగా తయారై, అంతర్జాతీయ సైనిక విన్యాసాల్లో పాల్గొనడం ప్రారంభించింది.

షింజో అబే ప్రధానమంత్రిత్వంలో జపాన్ వ్యూహాత్మక దృక్పథం మరింత మారిపోయింది. చైనా సముద్ర విస్తరణ, దూకుడు వైఖరి జపాన్‌లో తీవ్రమైన ఆందోళన రేపాయి. అమెరికా, భారత్, ఆస్ట్రేలియాతో కలిసి క్వాడ్ కూటమి ఆలోచనను ముందుకు తెచ్చింది జపానే. అంతే కాదు, దూర శ్రేణి క్షిపణులు సమకూర్చుకోవడం, నౌకాదళ వేదికలను విమాన వాహక నౌకలుగా మార్చడంవంటి నిర్ణయాలతో జపాన్ శాంతివాద చట్రంనుండి బయటకు అడుగు వేసింది. జాతీయవాద నేతలు "కాలం చెల్లిన శాంతివాద వ్యాఖ్యానాలు మనను బలహీనపరుస్తున్నాయి" అని వాదించారు.

తాకైచి యుగం: జపాన్ సీఐఏ పుట్టింది

నేడు జపాన్ ప్రధానమంత్రి సానే తాకైచి, అబే రాజకీయ వారసురాలిగా, ఆయన జాతీయవాద భావజాలాన్ని మరింత బలంగా ముందుకు తీసుకువెళుతున్నారు. చైనా ఇప్పటికే ఆమె భద్రతా వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల తాకైచి ప్రభుత్వం ఆమోదించిన బిల్లు జపాన్ నిఘా నిర్మాణంలో 70యేళ్ల తర్వాత అత్యంత మహత్తరమైన సంస్కరణగా చరిత్రకెక్కింది. "నేషనల్ ఇంటెలిజెన్స్ కౌన్సిల్" మరియు "నేషనల్ ఇంటెలిజెన్స్ బ్యూరో" పేర్లతో కేంద్రీకృత, నిలువుగా సమన్వయమైన నిఘా వ్యవస్థ నిర్మించబడుతోంది. దీన్నే జపాన్ సొంత సీఐఏగా వర్ణిస్తున్నారు నిపుణులు. ఈ బిల్లుపై 39.1 శాతం ప్రజలు మద్దతిచ్చారు. 41.9 శాతం తటస్థంగా ఉన్నారు. కేవలం 19 శాతం వ్యతిరేకించారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా చెబుతోంది -జపాన్ ప్రజలు ఇకపై రాజ్యాంగ సంకెళ్లకు అంతగా కట్టుబడి లేరని.

చైనా ఆందోళన, గ్లోబల్ టైమ్స్ హెచ్చరిక

చైనా అనధికారిక వక్త గ్లోబల్ టైమ్స్ పత్రిక ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిఘా బిల్లు జపాన్ నిఘా విధులను కేవలం దేశీయ భద్రత నుంచి విదేశీ సైనిక నిఘాకు మళ్లిస్తోందని, విదేశాల్లో గూఢచర్యం, చొరబాటు కార్యకలాపాలను అనుమతిస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగానే బీజింగ్ వ్యూహకర్తలకు ఇది నిద్రపట్టని సమస్య. జపాన్ యొక్క నైఋతి దీవులు తైవాన్‌కు భౌగోళికంగా సమీపంగా ఉన్నాయి. తైవాన్‌పై చైనా ఏదైనా సైనిక చర్య తీసుకోవాలంటే జపాన్ ప్రతిస్పందనను లెక్కలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సాధ్యం కాదు. జపాన్ దూరశ్రేణి సైనిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ, తైవాన్‌పై చైనా లెక్కలు మరింత సంక్లిష్టమవుతున్నాయి.

అమెరికా వైఖరి మారింది


ఆసక్తికరమైన విషయమేమిటంటే, 1945లో తాము విధించిన నిబంధనలకే అమెరికా ఇప్పుడు సడలింపు ఇస్తోంది. జపాన్ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, మేలైన సమాచార మార్పిడి సామర్థ్యాలు పెంచడం, ప్రతి నిఘా నిర్మాణాన్ని మెరుగుపరచడంవంటి అంశాల్లో అమెరికా జపాన్‌కు మద్దతిస్తోంది. కారణం.. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఒంటరిగా అన్నీ భరించలేదు. ఇరాన్, ఉక్రెయిన్ వంటి వివిధ యుద్ధరంగాలలో అమెరికా ఏకకాలంలో సైనిక బాధ్యతలు మోస్తున్న నేపథ్యంలో, చైనా తైవాన్‌పై దాడికి దిగితే సత్వర సైనిక జోక్యం ఎంత సాధ్యమో అనే సంశయం జపాన్‌లో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జపాన్ సొంత నిరోధక శక్తిని నిర్మించుకోవడం అనివార్యంగా మారింది.

ఆయుధాల పరంపర

ఈ వ్యూహాత్మక మార్పు కేవలం కాగితాలపై జరగడం లేదు. జపాన్ ఇప్పటికే ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలు, టామ్‌హాక్ క్షిపణులు, పేట్రియాట్ మరియు ఏజిస్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, అపాచీ దాడి హెలికాప్టర్లువంటి అత్యాధునిక వేదికలను నిర్వహిస్తోంది. అంతేకాదు, సొంత హైపర్‌సోనిక్ ఆయుధాలు, దూర శ్రేణి క్షిపణులు, విద్యుదయస్కాంత రైల్‌గన్లు అభివృద్ధి చేస్తోంది. బ్రిటన్, ఇటలీతో కలిసి ఆరోతరం యుద్ధ విమాన కార్యక్రమం (జీసీఏపీ) ముందుకు సాగుతోంది. ఇవన్నీ కలిసి చూస్తే జపాన్ కేవలం ఆత్మరక్షణకు సిద్ధమవడం లేదు, ప్రాంతీయ శక్తిగా తిరిగి ఆవిర్భవించడానికి పునాదులు వేస్తోందని స్పష్టమవుతోంది. తాకైచి ఇటీవల "సమగ్ర జాతీయ శక్తి దృక్పథం నుండి భద్రతను పరిశీలించే నిపుణుల సమావేశం"లో మాట్లాడుతూ, మరింత అధిక రక్షణ వ్యయం, బలమైన సైనిక సామర్థ్యాల అవసరాన్ని నొక్కి చెప్పారు.

జపాన్ ఈ పరిణామమే ఆసియాలో ఆందోళన కలిగించే అంశం కూడా. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ సామ్రాజ్యవాద దాడులకు బాధపడిన దేశాలు -చైనా, కొరియా, ఇతర ఆగ్నేయాసియా దేశాలు.. ప్రస్తుత మార్పులను అనుమానంగా చూస్తున్నాయి. ముఖ్యంగా "టోక్కో" అనే రహస్య పోలీసు వ్యవస్థ 1911 నుండి 1945 వరకు నిర్వహించిన నాజీ గెస్టపో, సోవియట్ ఎన్‌కేవీడీలతో పోల్చబడిన జపాన్ నిఘా చరిత్ర దృష్ట్యా, కొత్త నిఘా సంస్థ పుట్టుక పొరుగుదేశాలకు పాత పీడకలలు గుర్తుకు తెస్తోంది. అయితే అంతర్జాతీయ వాస్తవాలు మారిపోయాయి. ఉత్తర కొరియా ఉన్మాద అణు కార్యక్రమం, చైనా దూకుడు విస్తరణవాదం, ప్రపంచవ్యాప్త ఉగ్రవాద పరిశ్రమ -ఇవన్నీ జపాన్‌ను తప్పనిసరిగా మారేలా బలవంతం చేశాయని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "నిరోధం అప్పుడే పని చేస్తుంది, శత్రువుకు మన సామర్థ్యంపై, మన సంకల్పంపై నమ్మకం కలిగినప్పుడు" అని తాకైచి స్పష్టంగా ప్రకటించారు.

జపాన్ పునరుజ్జీవనం ఆసియా భద్రత సమీకరణాలను మొత్తంగా తలకిందులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనాకు తల నొప్పి, అమెరికాకు ఊరట, తైవాన్‌కు పరోక్ష రక్షణ కవచం -ఇవన్నీ జపాన్ మిలటరీకరణ ఫలితాలుగా కనిపిస్తున్నాయి. శాంతిని కోరిన దేశం సురక్షితంగా ఉండాలంటే శక్తిని సమకూర్చుకోవాల్సిన అనివార్య స్థితిలో పడింది. చరిత్ర చక్రం మళ్ళీ తిరిగింది. జపాన్ మేల్కొంది. ఆసియా ఉలిక్కిపడింది!! ■



# ఆ సముద్రం.. ఇంకా పిలుస్తోంది!

పిల్లలకు నేర్చుకోవడం తెలుసు, అడ్డుపడకుండా ఉంటే చాలు. ఈ సత్యాన్ని తొంభైయేళ్ల క్రితమే గుర్తించిన గురువు -ఆంటోని బెనైజెస్. పిల్లలను పిల్లలుగా ఉండనివ్వాలన్న ఆయన జ్ఞానం ఆనాటి వ్యవస్థకు నేరంగా కనిపించింది. ఒక ప్రశ్న... ఒక విప్లవం!

స్పెయిన్ అంతర్యుద్ధ మంటల మధ్యలోనే ప్రభుత్వం ఒక చిన్న దీపం వెలిగించింది. దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్యను నిర్బంధం చేసి, బోధనా మిషన్లు ఏర్పాటుచేసింది. ఆ మిషన్ పంపిన యువ ఉపాధ్యాయుడు బ్రుజెస్ అనే మారుమూల పల్లెకు వచ్చాడు. సూట్‌కేసులో బట్టలు మాత్రమే కాదు, బోలెడన్ని కొత్త ఆలోచనలూ తెచ్చుకున్నాడు. ఆ పల్లె పిల్లలకు అప్పటిదాకా బడి అంటే గోడలు, కొరడా, భయం. ఆంటోని వచ్చాక బడి అంటే ఆట, సంగీతం, ప్రశ్నలైంది. సంప్రదాయ వరుసకుర్చీలు లేవు. బెత్తం లేదు. విద్యార్థులు బృందాలుగా కూర్చుని, ఒకరికొకరు నేర్పుకుంటూ, తమకు నచ్చింది తామే ఎంచుకుంటూ నేర్చుకున్నారు. తరగతి గది సెలయేటి గట్టుదాకా విస్తరించింది. పాఠాలు పొలాల్లో మొదలయ్యాయి. అప్పుడే ఆ ప్రశ్న వేశాడు -"సముద్రం ఎలా ఉంటుంది?" పిల్లల ఊహలు రెక్కలల్లార్చాయి. "చాలా నీళ్ళు ఒకచోట చేరితే సముద్రం" అన్నారొకరు. మరొకరు బొమ్మ గీశారు, అలలు, చేపలు, తెల్లటి నురుగుతో. ఇంకొకరు "సముద్రమంటే ఆకాశం కిందకు దిగి నడుస్తున్నట్టు ఉంటుందేమో!" అమాయకత్వం, సృజనశీలత, స్వేచ్ఛ ఈ మూడూ కలిసి ఆ చిన్న తరగతిలో అద్భుతమైన కవిత్వం రాశాయి. ఆంటోని ఆ ఊహలన్నింటినీ ప్రెస్‌లో అచ్చువేశాడు. పుస్తకానికి పేరు పెట్టాడు -"సముద్రం! ఎన్నడూ చూడని పిల్లల ఊహల్లో!".

వాగ్దానం... నెరవేరని ప్రయాణం


పిల్లలు మరీ ఉత్సాహపడిపోయారు. "మాష్టారూ, నిజంగా సముద్రం చూపిస్తారా?" అని అడిగారు. ఆంటోని చిరునవ్వుతో "తప్పకుండా తీసుకెళ్తాను, నా సొంత ఊరికి" అన్నాడు. పిల్లలు రోజులు లెక్కపెట్టారు, అలలు వినాలని కలలుగన్నారు. ఇసుకలో కాళ్లు పెట్టాలని ఆశపడ్డారు.

కానీ ఆ రోజు రాలేదు.

1936 జూలైలో ఆంటోని మాయమయ్యాడు. ఛాందసులకు ఆయన బోధన నచ్చలేదు. పిల్లలు స్వేచ్ఛగా ఆలోచించడం వారికి ప్రమాదంగా కనిపించింది. స్పెయిన్ అంతర్యుద్ధం రగిలిన ఆ రోజుల్లో ఆంటోని ఏమయ్యాడో ఎవరికీ తెలియలేదు. సముద్రం కోసం ఎదురుచూసిన పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. గురువు కోసం వేచి అలసిపోయారు. కానీ ఆ వాగ్దానం గుండెల్లో చెరగకుండా నిలిచిపోయింది. ఆ మరుగున పడిన కథను 2013లో ఫ్రాన్సెస్క్ ఎస్ట్రిబానో తన పుస్తకంలో తవ్వి తీశాడు. "సముద్రాన్ని వాగ్దానం చేసిన ఉపాధ్యాయుడు." మరో పదేళ్ళకు అదే కథ వెండితెరపై "ద టీచర్ హూ ప్రామిస్డ్ ద సీ" అయింది. అప్పుడు ప్రపంచానికి తెలిసింది -ఆంటోని కేవలం టీచర్ కాదు, దర్శనమని.

సినిమాలో ఆంటోని అంటాడు.. "పిల్లలు ఎదగాలని బడిలో చేరుస్తారు. వాళ్లు త్వరగా పెద్దవాళ్లయిపోతే తమకు భారం కారనుకుంటారు. కానీ అసలు ఏదైనా నేర్చుకోవాలంటే పిల్లలు పిల్లలుగా ఉండాలి కదా ముందు". ఈ మాటలు వినగానే గుండెలో ఏదో గుచ్చుకుంటుంది. ఎందుకంటే నేటి బడులు చూస్తే అర్థమవుతుంది. మనం పిల్లల బాల్యాన్ని మార్కుల మూటలతో నింపేస్తున్నాం. నాలుగేళ్ళ పిల్లాడికి ర్యాంకు పోటీ, ఏడేళ్ళ పిల్లకు ట్యూషన్ భారం, పదేళ్ళ వయసులోనే "నీ భవిష్యత్తు ఏమిటి?" అనే ప్రశ్న. బాల్యం అనే సముద్రాన్ని చూపించే ముందే, బుక్కుల సంచి వారి భుజాలపై వేసి పరిగెత్తమంటున్నాం. నేర్చుకోవడం అంటే కేవలం జ్ఞాపకం చేసుకోవడం కాదు --- అనుభవించడం. ప్రశ్నించడం. తప్పు చేయడం. మళ్ళీ ప్రయత్నించడం. ఆంటోని చేసింది అదే. పాఠ్యపుస్తకంలో "సముద్రం" అని రాసి చదివించలేదు. బదులుగా "సముద్రం అంటే ఏమిటని నువ్వు అనుకుంటున్నావు?" అని అడిగాడు. ఆ ఒక్క ప్రశ్న పిల్లలను రచయితలుగా, కళాకారులుగా, ఆలోచనాపరులుగా మార్చింది.

ఆ సముద్రం ఇంకా పిలుస్తోంది. ఆంటోని లేడు. పిల్లలు పెద్దయ్యారు. బ్రుజెస్ పల్లె మారిపోయింది. కానీ ఆ ప్రశ్న మాత్రం చెరగలేదు --- "సముద్రం ఎలా ఉంటుంది?"



పెద్దల మాటలు చాదస్తం కాదు. జీవితం కొంచెం ముందుకు సాగాక, వాటి లోతు అర్థమవుతుంది. ఎందుకంటే, వాళ్లు చెప్పే ప్రతి మాటా అనుభవం నుంచి పుట్టిందే. వారు నడిచిన దారిలో పడిన తొట్రుపాట్లే, మనకు హెచ్చరికలు. చద్దిమూట అంటే రాత్రి అన్నం పొద్దున రుచిగా ఉండటం. అలాగే -పెద్దల మాటలు సమయానికి రుచించకున్నా.. కాలం గడిచాక మనసులో మరింత గాఢంగా నాటుకుంటాయి. "తొందరపడకు," "నీతిగా బతుకు," "డబ్బు కంటే మనిషి విలువ ముఖ్యం" -ఇవి కేవలం మాటలు కాదు, వారు జీవితంలో నేర్చుకున్న పాఠాలు. పాటిద్దాం!!

-మహాదేవ

వింతల్లో వింతలు

## దేవుని మెనూకి వెళ్దాం!



డైట్లు చాలా చూశాం. కీటో, వీగన్, పాలియో... కానీ ఇప్పుడు వచ్చింది "బైబిలికల్ డైట్!". అంటే బైబిల్‌లో పేర్కొన్న ఆహారాలే తినాలన్నమాట. టిక్‌టాక్‌లో 5 లక్షలమంది ఫాలోవర్లున్న కైలా బండీ అనే ప్రభావశాలి, "ఆహారం ద్వారా పాపం వచ్చింది, ఆహారంతోనే పోరాడతా!" అంటోంది. యేసు బ్రేక్‌ఫాస్ట్‌లో రొట్టె, చేప తిన్నాడు కాబట్టి కార్బ్స్-ప్రొటీన్ బ్యాలెన్స్ పాటించమంటున్నారు క్రైస్తవ డైటీషియన్లు. లోకల్ ఫుడ్, ప్రేయర్, బైబిల్ వర్సెస్.. అన్నీ కలిపి వడ్డిస్తున్నారు. కోచింగ్ సెషన్లకు నెలకు రూ.60,000! ఆత్మ శుద్ధికి. పాపం, జేబు శుద్ధికి మాత్రం గ్యారంటీ ఇవ్వట్లేదు!

స్పోర్ట్స్

# టీమిండియాలోకి కొత్త ముఖం..

# కన్ఫార్మ్ చేసిన కోచ్

మరో రెండు రోజుల్లో (జూన్ 6) ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్ (ముల్లాన్‌పూర్) కోసం టీమిండియా సర్వం సిద్ధం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున ఓ యువ ఆటగాడు అరంగేట్రం చేసే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. టీమిండియా సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కటే ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. యువ స్పిన్నర్లు హర్ష్ దూబే, మానవ్ సుతార్‌లో ఎవరో ఒకరికి తుది జట్టులో చోటు దక్కవచ్చని సంకేతాలు ఇచ్చాడు. దీంతో వీరిలో ఒకరు టెస్టు క్యాప్ అందుకోవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ముల్లాన్‌పూర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే అవకాశముండటంతో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్, రెండో స్పిన్నర్‌గా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ బరిలోకి దిగడం దాదాపుగా ఖాయం కాగా.. మూడో స్పిన్నర్ స్థానం? కోసం హర్ష్, సుతార్ మధ్య పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. పేసర్లుగా మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేర్లు ఖరారయ్యాయి. బుమ్రా గైర్హాజరీలో సిరాజ్ పేస్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ రెడ్డి బరిలోకి దిగడం కూడా ఖయంగా తెలుస్తోంది. బ్యాటింగ్ విషయానికొస్తే.. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ పేర్లు దాదాపుగా ఖరారయ్యాయి. మేనేజ్‌మెంట్ ఒకవేళ మరో స్పెషలిస్ట్ బ్యాటర్‌తో బరిలోకి దిగాలని భావిస్తే.. నితీశ్‌ను పక్కన పెట్టి ధృవ్ జురెల్‌కు అవకాశం ఇవ్వవచ్చు.



## ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం

**ముంబై:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ(ఎఆతీఫ్ ఖశీష్ట్రశ్రీఆ) దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ టోర్నీలో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. 37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపీఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం. అయితే రోహిత్ శర్మ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా తెలియదు. ఐపీఎల్‌లో రోహిత్‌కు కూడా తొడకండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. అయినా అతన్ని భారత జట్టుకు తీసుకున్నారు. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న కోహ్లీ, రోహిత్‌లు.. వన్డేలపై దృష్టి పెట్టారు. అయితే వచ్చే ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరూ ఆడుతారేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఆఫ్ఘనిస్తాన్‌తో లక్నోలో 17న రెండో వన్డే, చెన్నైలో 20న మూడో వన్డే జరగనున్నది.



## నెంబర్ వన్ చేతిలో మళ్లీ ఓడిన పీవీ సింధు.. ఇండోనేషియా ఓపెన్ నుంచి ఔట్



**జకార్తా**

ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఇండోనేషియన్ ఓపెన్‌లో ఇవాళ ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమ పరాజయాన్ని చూవిచూసింది. 17-21, 14-21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం. ఇవాళ జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10-10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15-14 లీడ్ సాధించింది. కానీ ఆన్ దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

మీనాక్షి చౌదరి క్లాసిక్ చీర లుక్‌లో టైమ్‌లెస్ గాంభీర్యాన్ని ప్రసరిస్తుంది



## చేపల మార్కెట్‌కి వెళ్లి మాకు నచ్చే చేపలు కొని తెచ్చేది!- జాన్వీ



భారతీయ సినీపరిశ్రమలో తనదైన అద్భుత నటన, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ కిడ్ జాన్వీ కపూర్ తాజాగా తన తల్లి, దివంగత నటి శ్రీదేవి గురించి సంచలన విషయాలను షేర్ చేసారు. ప్రస్తుతం టాలీవుడ్ – బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న జాన్వీ ఒక ఇంటర్వ్యూలో తన తల్లి వారసత్వాన్ని మోయడంపై మనసు విప్పారు. సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టినప్పటి నుండి తన తల్లి ఇమేజ్‌తో ఎదురవుతున్న పోలికలు, తన వ్యక్తిగత ఎదుగుదల.. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ సరసన –పెద్ది– వంటి భారీ చిత్రాలలో నటిస్తున్న తరుణంలో తన ఆలోచనా విధానం ఎలా ఉందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిన్నతనంలో తన తల్లి శ్రీదేవి ఎంతటి పెద్ద సూపర్‌స్టారో.. దేశవ్యాప్తంగా మామ్‌కు ఎంతటి క్రేజ్ ఉందో తనకు అస్సలు తెలిసేది కాదని జాన్వీ కపూర్ చెప్పారు. తాము ఎంత పెద్ద స్టార్ ఫ్యామిలీకి చెందినవారమైనా ఇంట్లో మాత్రం సినిమా వాతావరణాన్ని తల్లి ఎప్పుడూ దూరంగానే ఉంచేదని.. ఒక సాధారణ తల్లిలాగే తమను చూసుకునేదని వెల్లడించారు. మాకు అమ్మ సూపర్‌వుమన్ ఎందుకు అంటే.. ప్రతి శుక్రవారం ఫిష్ మార్కెట్‌కు వెళ్లి వంటకు ఏ రకం ఫిష్ బాగుంటుందో స్వయంగా ఎంపిక చేసి తీసుకురావడం. ఆ పనులన్నీ చేయడంలో అమ్మ ఎంతో గర్వంగా, సంతోషంగా ఫీల్ అయ్యేది! అని జాన్వీ తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను స్వయంగా నటనా రంగంలో అడుగుపెట్టి నటిగా పని చేయడం ప్రారంభించాకనే.. అసలు తన తల్లి ప్రేక్షకులకు ఎంతటి ఆరాధ్య దైవమో.. వారి జీవితాల్లో ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉందో పూర్తిగా అర్థం కావడం ప్రారంభమైందని జాన్వీ అన్నారు. వెండితెరపైనే కాకుండా.. సాధారణ ప్రజల మనసుల్లో శ్రీదేవి పై ఉన్న అపారమైన ప్రేమాభిమానాల గురించి తెలుసుకోవడం ఒక గొప్ప బ్లెస్సింగ్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి అపారమైన ప్రజాదరణ తరాలకోసారి.. ఎప్పుడో ఒకసారి మాత్రమే సాధ్యమవుతుందని.. తన తల్లి సృష్టించిన ఆ మ్యాజిక్‌ను మళ్లీ రీ–క్రియేట్ చేయడం ఎవరికైనా దాదాపు అసాధ్యమని జాన్వీ స్పష్టం చేశారు. సినిమా రంగంలో తనను నిరంతరం తల్లి శ్రీదేవితో పోల్చడంపై జాన్వీ కపూర్ ఎంతో మెచ్యూర్డ్‌గా సానుకూల దృక్పథంతో స్పందించారు. చిత్ర పరిశ్రమలో ఎవరినో ఒకరితో పోల్చడం చాలా సహజమైన విషయమేనని జాన్వీ పేర్కొన్నారు. నన్ను భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్‌తో పోలుస్తున్నప్పుడు.. నేను దానిని ఒక అదృష్టంగా భావిస్తాను. ఆ పోలికలు నన్ను మరింత కష్టపడటానికి నా నటనను ప్రతి సినిమాకు మెరుగుపరుచుకోవడానికి ఒక గొప్ప ఎనర్జీని, మోటివేషన్‌ను ఇస్తాయి తప్ప అందులో ఎలాంటి నెగిటివిటీ లేదు! అని జాన్వీ చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం తాను ఏ సినిమా చేసినా పూర్తి స్థాయి నిజాయితీతో చేస్తున్నానని.. నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ కిడ్ అనే ట్యాగ్ ..శ్రీదేవి ఇమేజ్ తెచ్చే ఒత్తిడిని నెగిటివ్‌గా తీసుకోకుండా తన కెరీర్‌కు అదొక ఇంధనంగా మార్చుకున్నానని జాన్వీ కపూర్ చెప్పిన విధానం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, మునుముందు నటిగా మరిన్ని శిఖరాలను అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. చరణ్– జాన్వీ జంటగా నటించిన పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



గోల్డెన్ గౌన్ బీచ్ ఫోటోషూట్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ స్టన్స్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com